ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్టం 39.7 / కనిష్టం 27.1
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
మంగళవారం 20 మే 2025

నేడు డయల్ యువర్ ఆర్టీసీ కార్యక్రమం

సుభాష్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ఎం జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ రీజినల్ మేనేజర్ 9959226011, ఆర్మూర్ డిపో మేనేజర్ 9959226019, బోధన్ డిపో మేనేజర్ 9959226001, నిజామాబాద్ డిపో-1 మేనేజర్ 9959226016, నిజామాబాద్ డిపో-2 మేనేజర్ 9959226017, కామారెడ్డి డిపో మేనేజర్ 9959226018, బాన్సువాడ డిపో మేనేజర్ 9959226020 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భరతలక్ష్మి

సమస్యల పరిష్కారానికే మధ్యవర్తిత్వ కేంద్రం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భరతలక్ష్మి

నిజామాబాద్ అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): సామరస్య పూర్వకంగా సమస్యల పరిష్కార మార్గమే సామాహిక మధ్యవర్తిత్వ కేంద్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా ప్రధాన న్యాయాధికారి భరతలక్ష్మి అన్నారు. సోమవారం దుబ్బరోడ్‌లోని ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ కార్యాలయంలో మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను స్నేహ సొసైటీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు ఈ మధ్యవర్తిత్వ కేంద్రాలను ఏర్పాటు చేశామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కొంత మంది తటస్థ వ్యక్తులను ఎంపిక చేసి వారికి శిక్షణ కల్పించి ఈ కేంద్ర నిర్వాహణ బాధ్యతను అప్పగించడం జరుగుతుందన్నారు. ఒక్కో కేంద్రంలో ఐదుగురు కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లు ఉంటారని ప్రధానంగా మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా సామరస్య పూర్వకంగా సమస్యలను పరిష్కరించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి విజయ్‌భాస్కర్‌రావు, బార్ కౌన్సిల్ మెంబర్ రాజేందర్‌రెడ్డి, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ఇందూరు యువత అధ్యక్షుడు సాయిబాబా పాల్గొన్నారు.

కోర్టులో ఉద్యోగం పేరిట మోసం!

- నకిలీ ఆర్డర్ కాపీతో బురిడీ కొట్టించిన మెసగాడు
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

8

ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టుల పూర్వవైభవానికి చర్యలు!



- శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

- ప్రాజెక్టుల్లో పూడిక మట్టి తొలగింపునకు అధికారుల కసరత్తు
- ఎస్సారెస్పీలో రూ.14వేల కోట్లు, నిజాంసాగర్‌లో రూ.7,500 కోట్ల ఆదాయ రాబడికి ప్రతిపాదనలు
- ఈ నెలలోనే టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- పూడిక తొలగిస్తే అదనపు ఆయకట్టుకు అందనున్న సాగునీరు





- నిజాంసాగర్ ప్రాజెక్టు

నిజామాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలోని శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రాజెక్టుల్లో పూడికను తీసి కెపాసిటీని స్థిరీకరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి రూ.14వేల కోట్లు, అలాగే నిజాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి రూ.7500 కోట్ల ఆదాయ రాబడికి ప్రతిపాదనలు రూపొందించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించిన సాగునీటి శాఖ అధికారులు.. పూడిక మట్టిని తీసేందుకు టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలలోనే టెండర్లు పిలవడంతో పాటు పూడిక తీసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. గోదావరి, మంజీర నదుల ద్వారా వచ్చే వరదలతో ఈ రెండు ప్రాజెక్టుల కెపాసిటీ ప్రతీ యేడు తగ్గుతుండడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టులో పూడిక మట్టితో పాటు ఇసుక ఎక్కువగా ఉండడం వల్ల టెండర్లు ఖరారు చేసి కాంట్రాక్టర్లకు అప్పజెప్పనున్నారు. ఆ తర్వాత కాంట్రాక్టర్ల నుంచి మట్టి తరలింపు ద్వారా ఎస్సారెస్పీ నుంచి రూ.14వేల కోట్లు, అలాగే నిజాంసాగర్ నుంచి 7,500కోట్లు వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఉత్తర తెలంగాణలోనే కీలకమైనది శ్రీరాంసాగర్ ప్రాజెక్టు. గోదావరి నదిపై 1963లో 112టీఎంసీల కెపాసిటీతో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. జిల్లాలోని పోచంపాడ్ వద్ద చేపట్టిన ఈ ప్రాజెక్టును 1983లో జాతికి అంకితం చేశా రు. ప్రాజెక్టుకు ప్రతీ యేడు వచ్చే వరదల వల్ల 40ఏళ్లలో 30టీఎంసీల కెపాసిటీ తగ్గిపోయింది. వరదలతో పాటు నల్లమట్టి, ఇసుక ఎక్కువగా కొట్టుకు రావడం వల్ల ప్రాజెక్టు పరిమాణం తగ్గిపోతోంది. ఉత్తర తెలంగాణ పరిధిలోని నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాలతో పాటు నల్గొండ, ఖమ్మం జిల్లాల పరిధిలోని కొన్ని మండలాలకు సాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. కాకతీయ కాల్వ ద్వారా ఈ ఉమ్మడి జిల్లాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా నిర్మించారు. స్టేజ్-1 కింద కాకతీయ కాల్వ ద్వారా వరంగల్ వరకు సాగునీటిని అందించగా.. స్టేజ్-2 ద్వారా సూర్యాపేట, ఖమ్మం జిల్లాల వరకు ఈ నీటిని తరలించారు. సరస్వతీ కాల్వ ద్వారా నిర్మల్ జిల్లా పరిధిలో సాగునీరు అందుతుండగా.. లక్ష్మీ కాల్వ ద్వారా జిల్లా పరిధిలో అధికారులు సాగునీటిని అందిస్తున్నారు.

ఇవే కాకుండా గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాలకు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు మొదట రూపకల్పన చేసినప్పుడు 11లక్షల 50వేల ఎకరాలకు సాగునీరు అందించాలని అధికారులు నిర్ణయించారు. దానికి అనుగుణంగానే కాల్వల నిర్మాణం చేపట్టారు. అయితే తర్వాత కాలంలో వరదలు ఎక్కువగా రావడం, మహారాష్ట్ర నుంచి నల్లమట్టి, ఇసుక ఎక్కువగా కొట్టుకురావడం వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కెపాసిటీ భారీగా తగ్గిపోయింది. ప్రాజెక్టు నిర్మించేటప్పుడు 112టీఎంసీల కెపాసిటీతో నిర్మాణం చేపట్టగా.. ప్రస్తుతం 80.33 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టులో 32టీఎంసీల వరకు కెపాసిటీ తగ్గిపోవడం వల్ల గతంలో రెండు సీజన్‌లకు సాగునీరు అందించగా.. ప్రస్తుతం ఒకే సీజన్‌కు అందే పరిస్థితి ఏర్పడింది.



- శ్రీరాంసాగర్‌లో తగ్గిన నీటిమట్టం

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం..

:శ్రీనివాస్, ఇరిగేషన్ సీఈ

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు మళ్లీ పూర్వవైభవం తీసుకొచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం. ఈ రెండు ప్రాజెక్టుల్లో పూడిక బాగా పెరిగిపోయింది. అందువల్ల పూడిక తీయడం వల్ల ఆ యా ప్రాజెక్టులు నిర్మించిన సమయంలో ఉన్న కెపాసిటీలను మళ్లీ తీసుకొచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. టెండర్లు పిలిచిన తర్వాత పూడిక తీత పనులు చేపడతాం.. ప్రాజెక్టుల్లో అదనపు నీటి నిల్వ పెరిగితే ఆయకట్టుకు కూడా ఎక్కువ విస్తీర్ణంలో సాగు నీరు అందుతుంది.

పూడిక మట్టితో తగ్గుతున్న ఎస్సారెస్పీ సామర్థ్యం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మించిన 40 ఏళ్లలోనే పూడిక మట్టి ద్వారా కెపాసిటీ తగ్గిపోవడంతో.. దాన్ని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా సాగునీటి శాఖ ఆధ్వర్యంలో అధికారులు ప్రాజెక్టు రిపోర్టును తయారు చేశారు. గత నెలలో ఇంజనీరింగ్ చీఫ్‌కు నివేదికను సైతం పంపించారు. ఈ నివేదిక ఆధారంగా ఈనెలలో పూడిక మట్టిని తీసేందుకు అధికారులు టెండర్లను పిలిచేందుకు చర్యలను చేపడుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 32టీఎంసీల వరకు పూడిక మట్టి చేరడం వల్ల దాన్ని తొలగించాలని నిర్ణయించారు. ఈ పూడిక మట్టి తొలగింపునకు రూ. 14వేల కోట్లుగా నిర్ణయించారు. ఈ మట్టిని తొలగించేందుకు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పజెప్పేందుకు

మిగతా 8వ పేజీలో...



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి శ్రీనివాస్



నూతనంగా ముద్రించిన తెలంగాణ తల్లి ప్రతిమ

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..

- 87 శాతం వరకు జిల్లాకు చేరిన పాఠ్యపుస్తకాలు
- మండల కేంద్రాలకు తరలిస్తున్న విద్యాశాఖ అధికారులు

నిజామాబాద్ అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే జిల్లాకు పాఠ్యపుస్తకాలు వచ్చేశాయి. వేసవి సెలవుల్లోనే పాఠ్యపుస్తకాలు జిల్లాలకు చేరాలని విద్యాశాఖ అధికారులు తీసుకున్న నిర్ణయం మేరకు ఇప్పటికే జిల్లాకు 87శాతం వరకు పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. జిల్లాకు మొత్తం 7లక్షల 18వేల 590 పుస్తకాలు అవసరం ఉండగా ఇప్పటి వరకు 6లక్షల 24వేల 960 పుస్తకాలు జిల్లాలోని గోదాములకు చేరుకున్నాయి. రెండు రోజుల నుంచి జిల్లాలోని మండలాలకు పుస్తకాలను తరలిస్తున్నారు. ఇప్పటి వరకు 72వేల 543 పుస్తకాలు మండల కేంద్రాలకు చేరవేశారు. విద్యాసంవత్సరం ప్రారంభం అనగా జూన్ 12 తేదీ నాటికి పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు చేరే విధంగా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలల ప్రారంభం రోజునే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. పాఠ్య పుస్తకాలను ఒకే పుస్తకంలో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాలలో ద్విభాష (బైలింగ్ వెల్)లో ముద్రించారు. ఈ విధానంలో ఏడాదికి రెండుసార్లు పాఠ్యపుస్తకాలను పార్ట్-1, పార్ట్-2 కింద విద్యార్థులకు పంపిణీ చేస్తారు. ఈసారి పుస్తకాలలో నూతనంగా రూపొందించిన తెలంగాణ తల్లి ప్రతిమను మొదటి పేజీలో ప్రచురించడంతో పాటు జయ జయహే తెలంగాణ నూతన గీతాన్ని రెండో పేజీలో రూపొందించారు. అదే విధంగా కృత్రిమ మేధాపై ప్రత్యేక పాఠాన్ని నూతన పుస్తకాలలో ముద్రించినట్లు తెలుస్తోంది.

పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఆర్థికభారం పడకూడదని ఉద్దేశ్యంతో ప్రభుత్వం పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌పుస్తకాలను ఉచితంగా అందజేస్తుంది. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ఇప్పటికే జిల్లా కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు చేరుకోగా నోట్‌పుస్తకాలను మాత్రం నేరుగా పాఠశాలకే పంపుతున్నారు. జిల్లా కేంద్రానికి వచ్చిన పాఠ్య పుస్తకాలను మండల వనరుల కేంద్రాలకు తరలిస్తున్నారు. పూర్తిస్థాయి పుస్తకాలు మండల కేంద్రాలకు వెళ్లిన తర్వాత అక్కడి నుంచి పాఠశాలలకు తీసుకువెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఏకరూప దుస్తులకు సంబంధించిన తయారీ దాదాపు పూర్తి కావస్తుండగా పాఠశాలల ప్రారంభం రోజున పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులను అందజేయనున్నారు.

ఏడాదికి రెండు సార్లు..

విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమయ్యేందుకు బైలింగ్ వెల్ విధానంలో పాఠ్యపుస్తకాలను ముద్రిస్తున్నారు. పాఠ్యపుస్తకంలో ఒకవైపు తెలుగు, మరోవైపు ఇంగ్లీష్ ముద్రించి పంపిణీ చేస్తున్నారు. అర్థంకాని పాఠ్యాంశాలు విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలలో చూసుకుంటున్నారు. విద్యార్థులకు ఈ బైలింగ్ వెల్ విధానంలో పుస్తకాలు ఒకేసారి పంపిణీ చేయడం వల్ల విద్యార్థులు బరువు మోయలేరని రెండు విడతలుగా పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. పార్ట్-1, పార్ట్-2గా విభజించి సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు పార్ట్-1 సిలబస్‌తో రూపొందించిన పుస్తకాలు వచ్చాయి. అర్ధసంవత్సరం ముగిసేలోపు పార్ట్-2కు సంబంధించిన పుస్తకాలు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ పాఠ్య పుస్తకంపై క్యూఆర్‌కోడ్‌ను ముద్రిస్తున్నారు. ప్రభుత్వ విద్యార్థులకు అందజేసే పుస్తకాలు ప్రైవేటులో అమ్మకుండా ఈ చర్యలు తీసుకు న్నారు. జిల్లాలో పార్ట్-1కు సంబంధించి 7లక్షల 18వేల 590 పుస్తకాలు అవసరం ఉండగా పార్ట్-2కు సంబంధించి 2లక్షల 35వేల 730 పుస్తకాలు అవసరం ఉంటాయి.

87 శాతం పుస్తకాలు వచ్చాయి..

:శ్రీనివాస్, పాఠ్యపుస్తకాల కేంద్రం ఇన్‌చార్జి

జిల్లాకు సంబంధించి ఇప్పటికే పాఠ్యపుస్తకాలు 87 శాతం వచ్చాయి. జిల్లాకు సంబంధించి 7లక్షలకు పైగా పుస్తకాలు అవసరం ఉంటే 6లక్షలకు పైగా వచ్చేశాయి. మండల కేంద్రాలకు కూడా పుస్తకాలను తరలిస్తున్నాం. ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.



- నగరంలో తిరంగా ర్యాలీ



పీవోకే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్

- ఇందూరులోనూ టెర్రరిస్టు మూలాలు
- ప్రపంచానికే భారత సైనిక శక్తి తెలిసింది
- సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ర్యాలీలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను సాధించుకునే వరకూ ఆపరేషన్ సిందూర్ కొనసాగుతూనే ఉంటుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే ధన్‌పాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందూరు జిల్లాలో టెర్రరిస్టు మూలాలు ఉన్నాయని ఏ ఇంట్లో దాక్కున్నా టెర్రరిస్టులను పాకిస్తాన్‌కు పంపించడం ఖాయమన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైనిక శక్తి ప్రపంచానికి తెలిసి వచ్చిందన్నారు. 23 నిమిషాల్లో ఇద్దరు మహిళా అధికారులు పాకిస్తాన్‌లో ఉన్న 9 ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేశారని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను అమెరికా అధ్యక్షుడు ఆపివేశారని చెబుతున్నారని అమెరికా అధ్యక్షుడికి భారత సైనిక శక్తితో భయం పుట్టిందన్నారు. దేశ ద్రోహులు భారతదేశంలో ఉన్నారని హైదరాబాద్‌తో పాటు జిల్లాలో దేశద్రోహులు ఉన్నారన్నారు. రెండు రోజులుగా 8 మంది పాకిస్తాన్ ఏజెంట్లు పట్టుబడ్డారని అన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి, రాణీ రుద్రమ పౌరుషాన్ని పుణికి పోసుకున్న వీర వనితలు కల్నా సోఫియా కురేషీ, వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ 9 ఉగ్రవాద స్థావరాలను వంద మంది ఉగ్రవాదులను మట్టుపెట్టారని అన్నారు. బ్రహ్మోస్ సుదర్శన్ ఎస్ 400 ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయేలా పాకిస్తాన్ ప్రధాని పారిపోయేలా చేసి కాళ్ల బేరానికి వచ్చేలా చేశాయని అన్నారు. ఇంటి దొంగలను గుర్తించాలని ఈ దేశం తిండి తింటూ ఈ దేశంలో ఉంటూ పాకిస్తాన్ లాంటి ఉగ్రదేశానికి జైకొట్టే వారిని గుర్తించి తరిమికొట్టాలన్నారు.



మాజీ సైనికులను సన్మానిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే, తదితరులు

ఇద్దరు మహిళలే పాకిస్తాన్‌ను భయపెట్టారు..

:దినేష్‌కులాచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

భారతదేశానికి చెందిన ఇద్దరు మహిళలే పాకిస్తాన్‌ను భయపెట్టారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. నరేంద్రమోదీ పోరాటం దేశం మీద కాదని ఉగ్రవాదం మీద అని అన్నారు. 23 నిమిషాల్లోనే పాకిస్తాన్‌ను గడగడలాడించారని అన్నారు. టర్కీ, చైనాలు కూడా భారతదేశానికి బయపడే స్థాయికి మోదీ తెచ్చారని అన్నారు. భారతీయుడిగా జీవిద్దామని భారతీయుడిగానే చద్దామని పిలుపునిచ్చారు.

పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచింది..

:పల్లెగంగారెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్

భారతదేశం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అభివృద్ధిని ప్రోత్సహించి దేశాన్ని అభివృద్ధి చేసుకుందని పాకిస్తాన్ మాత్రం ఉగ్రవాదాన్ని పెంచి పోషించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని పీవోకేను ఆక్రమించే వరకు ఆపరేషన్ సిందూర్ ఆగిపోదన్నారు. దేశంలో ఉంటూ పాకిస్తాన్‌కు అనుకూలంగా దేశానికి వ్యతిరేకంగా మాట్లాడిన ప్రతి ఒక్కరూ దేశద్రోహులు అవుతారని ఆయన అన్నారు.



నగరం తిరంగమయం..

సిటీజన్స్ ఫర్స్ నేషనల్ సెక్యూరిటీ కన్వీనర్ కృపాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా సోమవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ఆర్ఆర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మొత్తం త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. ఈ ర్యాలీ ఆర్ఆర్ చౌరస్తా నుంచి పెద్దబజార్, పోస్టాఫీస్ మీదుగా గాంధీచౌక్ వరకు జరిగింది. దేశభక్తి పాటలకు ర్యాలీలో పాల్గొన్న యువకులు, బీజేపీ నాయకులు, దేశభక్తులు త్రివర్ణ పతాకాలను చేతపట్టుకొని నృత్యాలు చేశారు. దేశభక్తి పాటలతో కోలాటలు ఆడుతూ మహిళలు నృత్యాలు చేశారు. దారి పొడవున సుమారు 50 మీటర్ల భారీ త్రివర్ణ పతాకంతో యువత ఆకర్షించారు. ర్యాలీ మొత్తం హిందూస్తాన్ జిందాబాద్ పాకిస్తాన్ ముర్దాబాద్ నినాదాలతో మారుమోగిపోయింది. గాంధీచౌక్ వద్ద సైనికులకు, మాజీ సైనికులకు, సైనికుల కుటుంబ సభ్యులకు ఘనంగా సన్మానించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్,మే19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యార్థుల ఉత్తీర్ణత శాతంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశంతో పాటు ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో బోధన్ మండలంలోని పెంటాకలాన్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో మొత్తం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. దీంతో మొదటి, ద్వితీయ ర్యాంకు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో విద్యార్థులందరు ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ప్రైవేటుకు దీటుగా అన్ని వసతులు కల్పిస్తున్నామని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్బయ్య, ఉపాధ్యాయులు పాటల శ్రీనివాస్, విద్యార్థిని, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మూడు బుల్లెట్ వాహనాల సైలెన్సర్ తీసివేత

బోధన్‌రూరల్,మే19(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో సౌండ్ పొల్యూషన్ చేస్తూ తిరుగుతున్న మూడు బుల్లెట్ వాహనాలను పట్టుకుని సైలెన్సర్‌లను రిమూవ్ చేసి ఫైన్ వేయడం జరిగిందని పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. సౌండ్ పొల్యూషన్ చేస్తున్న వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బుల్లెట్ వాహనాలను అధిక సౌండ్‌తో నడిపిస్తే కఠిన చర్యలతో పాటు జరిమాన విధించడం జరుగుతుందన్నారు.

రైతులు పంట మార్పిడిని పాటించి సుస్థిర ఆదాయాన్ని పెంపొందించుకోవాలి

● కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్వప్న

రెంజల్,మే19(ఆంధ్రజ్యోతి):రైతులు కాలానికి అనుగుణంగా పంటలను పండించుకోవాలని, ఒకే రకమైన పంటలు కాకుండా పంట మార్పిడి వల్ల రైతు సుస్థిర ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్వప్న అన్నారు.సోమవారం మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రుద్రూరు వ్యవసాయశాస్త్రవేత్త బీవీరాజ్‌కుమార్, వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు,మండల పశువైద్య అధికారివిఠల్, మాజీ సొసైటీ చైర్మన్ సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సయ్య, ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

మగ్గిడిలో ముగిసిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం

ఆర్మూర్ రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గత 20 రోజులుగా నిర్వహించిన వేసవికాల వాలీబాల్ శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ముఖ్య అతిథులుగా హాజరైనా ఎంవిఐ వివేకానంద రెడ్డి, ఆదిలాబాద్ ఆర్టీఏ డిప్యూటి కమీషనర్ రవీందర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని రాష్ట్ర జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాల న్నారు. పాఠశాల స్థాయినుంచి ఇష్టమైన క్రీడను ఎంచుకొని అందులో రాణించేందుకు సాధన చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో కే. శ్రీనివాస్‌రెడ్డి, ఉమమహేశ్వర్‌రావు,శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేల్పూర్ తహసీల్దార్‌కు సన్మానం

వేల్పూర్, మే 19(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌ను బీఆర్ఎస్, బీజేపీ, పార్టీ నా యకులతో పాటు స్థానిక వీఆర్‌ఏలు, పాస్టర్లు సన్మానించారు సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్‌ను ఆయన చాంబర్‌లో ఆయా పార్టీలకు చెందిన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, సామ మహిపాల్, కొంతం దేవన్న, పెద్దమల్లారెడ్డి, బబ్బురు ప్రతాప్‌రెడ్డి, మిట్టపల్లి మహిపాల్, బాల్‌రాజ్, పిట్లసత్యం, హన్మాంత్‌రెడ్డి, మహేష్, సుంకరి రాము, సృజన్, బీజేపీ పడిగెల రవి, జాన్కంపేట్ పాస్టర్ సేవా, గంగారెడ్డి, వివిధ గ్రామాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని దుకాణదారులకు జైలు

బోధన్‌రూరల్,మే19(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో రాత్రి సమయంలో నిర్దేశించిన సమయానికి మించి హోటల్, షాపులు తెరిపి ఉంచి నడపడంతో సదరు యాజమానులకు సోమవారం కోర్టు న్యాయమూర్తి శేషతల్ప సాయి ముందు హజరుపర్చగా ఇద్దరు దాబా యాజమానులకు, ఇద్దరు టీ షాప్ యాజమానులకు, ఒక టీ పాన్ యాజమానికి రెండు రోజుల జైలుశిక్ష విధించడం జరిగిందన్నారు. మరొకరికి తాగి వాహనం నడిపిన ఒక వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధించడం జరిగిందన్నారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హోటళ్ల, దాబాలు మూసి వేయాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

జులై 15 వరకు ఎత్తిపోతల పనులు పూర్తిచేయాలి

మాక్లూర్, మే 19(ఆంధ్రజ్యోతి): బొంకంపల్లి, ముల్లంగి లిఫ్ట్ పనులను జులై 15వ తేదీ వరకు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు కోరారు. సోమవారం మండలంలోని బొంకంపల్లి, ముల్లంగి లిఫ్ట్ పనులను లక్మాపూర్ వద్ద రైతులతో కలిసి ఎత్తిపోతల పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్‌రావు, అంజయ్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ శ్రీరామ రక్ష : సీఐ

కోటగిరి,మే19(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులకు హెల్మెట్ శ్రీరామ రక్ష అని రుద్రూరు సీఐ కృష్ణ పేర్కొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలో సోమవారం హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే వ్యక్తులు హెల్మెట్ తప్పనిసరి ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే హెల్మెట్ ప్రాణాలు కాపాడుతుందని ఆయన పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాయన్న పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో సహస్ర కళశాభిషేకోత్సవం


1001కలశాలతో ఆలయంలో ప్రత్యేక పూజలు

బోధన్‌రూరల్,మే19(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలు 13న ప్రారంభమై సోమవారంతో ముగిశాయి. వేద పండితులు గోవర్ధనం రాఘవ చారి నేతృత్వంతో రామాచారి, సురేష్ ఆచారిలతో పలువురు వేద పండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1001కలశములచే ఆలయ ప్రాంగణంలో నుంచి భక్తులచే కలశములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1001కలశములచే, భక్తులతో ఆలయం కిటకిటలాడింది. గోవిందా నామస్మరణతో సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వామపక్షనాయకులు


మెండోరలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, మే19(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం ఎడపల్లి మండల కేంద్రంతోపాటు నెహ్రూనగర్, అంబం గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజల అభ్యున్నతిని మరిచిందని, రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల హామీల అమలులో భాగంగా ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కల నిజం చేయడానికి స్థలం ఉండి ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్లు కట్టుకోడానికి పూర్తి సబ్సిడీతో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా 5 లక్షల రూపాయలను అందిస్తుందన్నారు. చిన్నవారికి ఇండ్లు లేని వారికి ఇండ్లు కట్టియ్యాలనే ఉద్దేశ్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. స్థలం ఉండి ఇండ్లు లేనివారికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని, ముగ్గు పోస్తేనే స్కీము వర్తిస్తుందన్నారు. గతంలో బేస్‌మెంట్ లెవల్ వరకు కట్టిన వారికి ఈ పథకం వర్తించదని, ఇప్పుడు ముగ్గు పోస్తేనే వర్తిస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు తొందరగా ఇంటి నిర్మాణం చేపట్టాలనే ఉద్దేశంతో డ్వాక్రా గ్రూపు మహిళలకు డ్వాక్రా గ్రూపు ద్వారా 50 నుండి 75 వేల వరకు రుణం మంజూరు చేయాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా లోను తీసుకుని త్వరగా బేస్‌మెంట్ వరకు కట్టుకుంటే హౌసింగ్ శాఖ నుంచి లక్ష రూపాలయలు ఇస్తారని, వెంటనే ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టే అబ్దిదారులకు ఇసుక, మొరం ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని, ప్రభుత్వానికి ఎలాంటి రుసుము కట్టవద్దని, తరలించే వారికి మాత్రమే డబ్బులు ఇవ్వాలన్నారు. మంజూరు అయిన ప్రతి ఒక్కరు అధికారులు సూచించిన విధంగా ఇళ్లు కట్టుకోవాలన్నారు. మొదటి విడతగా మండలంలో 350 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని రెండవ విడతలో అర్హత కలిగిన వారికి ఇంకా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో మాదిరి ప్రభుత్వ పథకాల మంజూరు కోసం ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరి కొరకు మధ్యవర్తులు ఎవరైనా డబ్బులు అడిగితే వారిపై చర్యలుంటాయన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్లా రాంమోహన్, మండల పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్, ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రేయ, ఎంపీడీఓ శంకర్, ఆయా గ్రా మాల పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాస్, పార్టీ నాయకులు బం జ కామప్ప, బొబ్బిలి శ్రీనివాస్, తూటుక్కార్ రవీందర్ రెడ్డి, కంచరి శ్రీనివాస్, యాసాడ రాజ్ కుమార్, ఇందిమ్మ ఇండ్ల లబ్దిదారులు తదితరులు ఉన్నారు.

బోధన్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం అర్హత కలిగిన పేద ప్రజలకు కేటాయించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం బోధన్ కార్యదర్శి శంకర్ గౌడ్ మాట్లాడుతూ మండలంలోని బండారుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను చాలామంది కట్టుకోవడానికి సిద్ధంగా ఉన్న పేద ప్రజలకు లబ్దిదారులుగా ఎంపిక చేయాలని వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ వహీద్, శారద, సాయిలు, మాధవరావు, కాశీ, గోపి తదితరులున్నారు.

మాక్లూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాంగంగా సోమవారం మండలంలోని ధర్మోరా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి విండో చైర్మన్ భూరోల్ల అశోక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ లబ్ధిదారుడు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్మారెడ్డి, ఎంపీవో శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మెండోర: నిరుపదలకు అండగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. సోమవారం మెండోర, వెల్కటూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. బుస్సాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒక అద్భుతమైన ఘట్టమని నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపదలకు అభయహస్తం ఇందిరమ్మ పథకమని పేర్కొన్నారు. నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ఉంటుందని ఆర్థిక స్థోమత లేక నిరుపేదల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఇల్లు లేని నిరుపేద అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేయాలని ప్రజా పాలనలో నిమోదు చేసుకున్న అర్హులందరికీ ముందుగా ఇండ్లు ఇస్తామని దశల వారిగా గూడులేని నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చడం తమ ప్రభుత్వ సంకల్పమని అన్నారు. ఈ కార్యక్రమంలో సోం రాజేందర్, బద్దీ సాయి, గుండోజీ రవి, బద్దం అశోక్, ఆశమ్మ, లక్ష్మీ, భూమేష్, సుమన్, శ్రీనివాస్, సాయరెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ఎమ్మెల్యే సహకారంతో బోధన్ నియోజకవర్గంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని సాలూర మండల అధ్యక్షులు మందర్నా రవి అన్నారు. సోమవారం సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్దిదారుల ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు వేసి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాలూర మండల తహసీల్దార్ శశిభూషణ్, నాయకులు చీల శంకర్, అల్లె జనార్ధన్, నర్సింహ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలో పలు వార్డుల్లో ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కోసం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్, హౌజింగ్ అధికారుల సమక్షంలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పారదర్శకంగా ఇండ్లను మంజూరు చేశామని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గోపు గంగాధర్, ఏఈ నిఖిల్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు స్వామి, జేజే నర్సయ్య, పర్స అనంతరావు, నాగేంద్రబాబు, వాక మహేష్, షాదుల్లా, సుంకరి సురేష్, సతీష్, కిరణ్, నల్లూరి శ్రీనివాస్, మొండి దినేష్, ప్రేమ్, విశాల్, సాయిబాబా, మహేష్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్:మండలం డీకంపల్లి గ్రామంలో సోమవారం ఇంది రమ్మ ఇళ్లకు ఎంపీడీవో గంగాధర్ మార్కింగ్ చేశారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని సూచించారు. మండలంలోనిఅన్ని గ్రా మాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించామన్నారు.ఈకార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి దినేష్, ఇందిరమ్మ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని చౌట్‌పల్లి, బసీరాబాద్, అమీర్‌నగర్ గ్రామాలలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, మడ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడిగెల ప్రవీణ్, కస్తూరి శ్రీనివాస్, శ్రీరాముల మురళి, దేవేందర్, బచ్చిమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలతో పంట పొలాలు సారవంతం

● డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

వేల్పూర్, మే 19(ఆంధ్రజ్యోతి): రైతులు జీలుగ విత్తనాలను వరి పొలంలో వేసుకోవడం వల్ల పంట భూములు సారవంతంగా పంట భూములు సారవంతంగా మార్చుకోవాలని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి సూచించారు. సోమవారం వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపొలం కోసిన తర్వాత వరికొయ్యలను రైతులు తగులబెట్టకుండా ఆ పొలానికి నీరు పారించి అందులో సింగిల్ సూపర్ ఫాస్పెట్ ఎరువును చల్లుకుంటే ఆ వరికొయ్యలు మురిగి పొలానికి మంచి ఎరువుగా తయారవుతాయన్నారు. వరికొయ్యాలను ఎరువు రూపంగా మార్చుకోవాలని కోరారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శృతి, సొసైటి వైస్ చైర్మన్ శ్రీధర్, కార్యదర్శి కృష్ణ, డైరెక్టర్లు, సంఘసిబ్బంది, ఏఈవోలు రైతులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంలో ప్రభుత్వం అందించిన 50 శాతం సబ్సిడీ జీలుగు విత్తనాలను సోమవారం రైతులకు అందజేశారు. 30 కిలోల బస్తా 4275 రూపాయల అసలు ధర కాగా ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ద్వారా 2138 రూపాయలకు అందించినట్లు ఏవో లావణ్య తెలిపారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టాపాస్ బుక్, ఆధార్‌కార్డు, వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో లావణ్య, ఏఈవో దివ్య, సొసైటి చైర్మన్ నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వామి, సురేందర్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


ఏర్గట్లలో జిలుగు విత్తనాలను పంపిణీ ప్రారంభిస్తున్న చైర్మన్ నర్సయ్య

మాక్లూర్: మాక్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కల్లెడ గ్రామంలో చైర్మన్ అశోక్ సోమవారం జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి రాంబాబు, ఏఈవోఉమాదేవి,డైరెక్టర్లు గంగారాం,చిన్నయ్య,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం వద్ద సోమవారం సబ్సిడీపై జిలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చైర్మన్ బర్మచిన్న నర్సయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వార 50 శాతం సబ్సిడితో రూ. 2138/లు చెల్లించి విత్తనాలు తీసుకెళ్లాలని, దీనికై రైతులు తమవెంటపట్టాపాస్ బుక్,ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని కోరారు.ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ సిం గసారం గంగారాం, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొరిపెల్లి లింగా రెడ్డి, రేండ్ల రాజారెడ్డి, కొలిప్యాక శ్రీనివాస్, ఏవో వైష్ణవ్, సీఈవో శ్రీనివాస్, పాల్గొన్నారు.

బట్టాపూర్‌లో ఘనంగా సంత్‌సేవాలాల్ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఏర్గట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బట్టాపూర్ గ్రామంలోని గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ జగదాంబ ఆలయ నాల్గవ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించగా గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బట్టాపూర్ తాండ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆలూర్, మే 19(ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండలం మిర్ధాపల్లి గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 36వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరుకు కృషి చేసిన ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్‌రెడ్డి, నిజాంసాగర్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ యాల్లా సాయిరెడ్డి లకు బాధిత కుటుంబం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు సాయిరెడ్డి, గాదెపల్లి మధు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆశాజ్యోతి కామ్రేడ్ సుందరయ్య


నవీపేటలో సుందరయ్య వర్ధంతి నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు


నివాళులు అర్పిస్తున్న దృశ్యం

వర్ని,మే19(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు యోధుడు భారత దేశ తొలి పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు దేశ ప్రజలే తమ బిడ్డలుగా భావించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని యావదాస్తిని పేద ప్రజలకు పంచిన గొప్ప మహనీయుడు కామ్రేడ్ సుందరయ్య అని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ కొనియాడారు. సోమవారం వర్ని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య 40వ వర్థంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కార్యకర్తలు నివాళులు అర్పించారు. సుందరయ్య జీవితం పార్టీ కార్యకర్తలకు నేటి యువతకు ఆదర్శనీయమని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని నన్నేసాబ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, సాయిలు, సురేష్, మారయ్య, సంజయ్, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి

నవీపేట: మండల కేంద్రంలో సోమవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్థంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా అనగాళపాడు గ్రామంలో జన్మించిన ఆయన 1964సంవత్సరంలో జాతీయ సీపీఎం కార్యదర్శిగా ఎన్నికయ్యాడని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాయక్‌వాడి శ్రీనివాస్, దేవేందర్ సింగ్, మహబూబ్, వసంత్, సావిత్రి, తదితరులున్నారు.

నేడు నవీపేట మండలంలో ఎమ్మెల్యే పర్యటన

నవీపేట,మే19(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మంగళవారం నవీపేట మండలంలో పర్యటించనున్నారని మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండలంలోని నాడాపూర్, జన్నేపల్లి, నవీపేట, నాగేపూర్, మద్దెపల్లి గ్రామాలలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ఆర్మూర్ రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎఫ్ఎం హెచ్ఎంలు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులందరికి మంగళవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రాజ్‌గంగారాం తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని రాంమందిర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తార న్నారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు సకాలంలో టెక్స్‌బుక్స్‌తో హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి బాల్కొండలో..

బాల్కొండ , మే 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20వ తేదీనుంచి 24వ తేదీ వరకు ప్రాథమిక స్థాయిలో బోధించే మండలస్థాయిలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని ఎస్‌జీటీ టీచర్లు, ఎల్ఎఫ్ఎం టీచర్లు ఉన్నత పాఠశాలలో పనిచేసే ఎస్‌జీటీ హాజరు కావాలని ఆయన కోరారు.

అసిస్టెంట్ లైన్‌మన్ కుటుంబానికి పరామర్శ

ఎడపల్లి, మే19(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజుల క్రితం విధులు నిర్వర్తిస్తుండగా విద్యుదాఘాతం తగిలి మరణించిన ఎడపల్లి గ్రామానికి చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ మహేందర్ కుటుంబ సభ్యులను 327 ఐఎన్‌టీయూసీ యూనియన్ సభ్యులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మహేందర్ నివాసానికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, వారి కుటంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మహేందర్ ఆత్మకు శాంతి కలగాలని కోరారు. పరామర్శించిన వారిలో ఎన్పీడీసీఎల్ కంపనీ వర్కింగ్ ప్రెసిడెంట్ పూదరి గంగాధర్, జిల్లా ప్రెసిడెంట్ వేణుగోపాల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మీరా, గంగాధర్, పవన్, జనార్ధన్, గణేష్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును సందర్శించిన ఎస్ఐ

రెంజల్,మే19(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సందర్భంగా కందకుర్తి గ్రామ శివారులో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఏర్పాటు చేయడం జరిగిందని రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఏర్పాట్లను పరిశీలించి చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. మహరాష్ట్ర నుండి సాటాపూర్ సంతకు అక్రమంగా ఆవులను రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కమ్మర్‌పల్లి , మే 19(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హల్దె శ్రీనివాస్ కుటుంబ సభ్యులను సోమవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. హల్దె శ్రీనివాస్ తల్లి కళావతి ఇటీవల మృతిచెందడంతో ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, మైలారం సుధాకర్, బద్దం రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో భూమి,భుక్తి కోసం పోరాటాలు చేయాలి : సీపీఎం

భిక్కనూరు, మే 19(ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఆయన ఆశయ సాధన కోసం భూమి, భుక్తి కోసం పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు కొత్త నర్సింలు, నాయకులు ప్రవీణ్, నర్సవ్వ, బాబ్జాన్, హన్మండ్లు, శ్యామల, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తిలో ప్రారంభమైన శత చండీయాగం

రెంజల్,మే19(ఆంధ్రజ్యోతి): కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం నందు సోమవారం శత చండీయాగాన్ని కందకుర్తి ఆశ్రమ వ్యవస్థాపకులు సీతారాం త్యాగి మహరాజ్ ప్రారంభించారు. పవిత్రమైన త్రివేణి సంగమ క్షేత్రం నందు తొమ్మిది రోజుల పాటు శత చండీ యాగం, భగవాత్ సప్తాహ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ఇట్టి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, యోగేష్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.


అయోధ్య స్వామీజీలకు స్వాగతం పలుకుతున్న సీతారాం త్యాగి మహరాజ్



ఎంజే హాస్పిటల్ వెళ్లే దారిలో ప్రమాదకరంగా మూల మలుపులు

ప్రమాదకరం.. మూలమలుపులు

పెర్కిట్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరమైన మూలమలుపులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఎంజే హస్పిటర్ వెళ్లే దారిలో మలుపులతో కూడిన దారిలో ప్రయాణించడం వాహనదారులకు నిత్యం ఇబ్బందిగా మారింది. ఈ దారిలో ప్రయాణించే వాహనాలకు మలుపు ఎక్కువగా ఉండటం వల్ల ముందువైపు నుంచి వచ్చే వాహనాలను గుర్తించడం ఇబ్బందిగా మారింది. ఈ దారిలో ప్రయాణించే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. చాలా సందర్భాలలో వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొని గాయాల పాలయ్యారు. ఎంజే హాస్పిటల్‌కి వెళ్లే దారి కావడంతో ఈ దారి గుండా వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పట్టణంలోని రహ దారిపై ట్రాఫిక్ ఎక్కువ కావడం వల్ల వాహనదారులు పెర్కిట్ చేరుకోవడానికి ఈ దారి గుండా ఎక్కువగా ప్రయాణం చేస్తారు. మూల మలుపు ఎక్కువగా ఉండ డం వల్ల నిత్యం వాహనాలు ప్రమాదాలకు గుర వుతున్నాయని స్థానికులు తెలిపారు. రాత్రి సమయంలో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటు న్నాయని వెంటనే సంబందిత అధికారులు చొరవ తీసుకొని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహన దారుల కోరుతున్నారు. అత్య వసరమైన సమయంలో ఆసుపత్రిని చేరుకోవడానికి వెళ్లాల్సిన సందర్భా లలో ప్రయాణించేటప్పుడు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థాని కులు, వాహనదారులు కోరుతున్నారు.

మలుపు ఎక్కువగా ఉండడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు గుర్తించడం కష్టమవుతుంది: రాకేష్, స్థానికుడు

ఈ మార్గంలో మలుపు ఎక్కువగా ఉండటం వల్ల తరచు వాహనాలు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నాము.

బురద రోడ్లు.. అస్తవ్యస్తంగా డ్రైనేజీలు

● ఇబ్బందుల్లో ప్రజలు ● పట్టించుకోని అధికారులు



విద్యానగర్, ఆదర్శనగర్‌లలోని బురదమయమైన రోడ్లు

ఆర్మూర్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లిలోని విద్యానగర్ కాలనీ, ఆదర్శనగర్ కాలనీలు ఏర్పాటై 15 సంవత్సరాలు గడుస్తున్నా మౌళిక వసతులు కరువయ్యాయి. రోడ్లు బురద మయంగా మారి రాకపోకలకు, నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. విద్యానగర్ కాలనీలో డ్రైనేజీలలో సాఫీగా వెళ్లాల్సిన మరికి నీరు రోడ్లపైకి పారి బురదమయంగా తయారవుతున్నాయి. గతంలో నిర్మించిన డ్రైనేజీలు లోతుగా ఉండడం, నూతనంగా నిర్మించిన రోడ్లు ఎత్తులో ఉండడంతో డ్రైనేజీలో మురికి నీరు చెత్తచెదారంతో నిండి రోడ్లపైకి వస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నిత్యం బురదతో కూడుకున్న రోడ్లపై నుంచే వెళ్లాల్సి వస్తుందని వారు వాపోతున్నారు.

ఆదర్శనగర్‌లో సమస్యలు అనేకం

మామిడిపల్లి శివారులోని మరో కాలనీ ఆదర్శనగర్. ఈ కాలనీలో సమస్యలకు కొదువలేదు. ఏళ్ల క్రితం ఏర్పాటైన ఈ కాలనీలో సరైన రోడ్లు లేకపోవడం కాలనీవాసులను ఆందోళనకు గురిచేస్తుంది. ఆదర్శనగర్‌లోని ఐదో వీధి క్రాస్ రోడ్డు నుంచి మామిడిపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయం వరకు బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. ఆ కాలనీ సమీపంలోని హనుమాన్ ఆలయం వరకు బీటీ రోడ్డు నిర్మిస్తే కాలనీవాసులకు సౌకర్యంగా ఉండేది. ఆ స్థలంలో గతంలో వేసిన సీసీరోడ్డు ఉన్నప్పటికీ సీసీ రోడ్డుపై గుంతలమయంగా మారింది. మట్టి పేరుకుపోయి సీసీ రోడ్డు ఆనవాలు లేకుండా పోయింది. నూతనంగా ఇండ్లు నిర్మించుకునేవారు వారి ఇండ్ల పరిధిలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో నూతన ఇంటికి వినియోగంచే నీరు మొత్తం రోడ్డుపై నిలిచి బురదమయంగా తయారై స్థానికులకు అసౌకర్యంగా మారింది.

ఇంటిపన్నులు చెల్లిస్తున్నా సమస్యలు తీర్చరా!?

విద్యానగర్, ఆదర్శనగర్‌లలో ఏళ్ల క్రింద ఇండ్లు నిర్మించుకుని నివాసం ఉంటూ ప్రతీ సంవత్సరం సక్రమంగా ఇంటిపన్నులు చెల్లిస్తున్నప్పటికి కాలనీ సమస్యలు మాత్రం తీరడం లేదు. రోడ్లపై బురద ఉండడంతో నిత్యం హనుమాన్ మందిరానికి పూజలు చేయడానికి వెళ్లే భక్తులకు, మహిళలకు అసౌకర్యంగా మారింది. దేవుడి గుడికి కూడా బురదరోడ్డు పై నుంచి వెళ్లాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిస్తే మట్టి రోడ్లతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారంటున్నారు. డ్రైనేజీలలో సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో డ్రైనేజీల వద్ద ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి డ్రైనేజీలో చెత్తచెదారంతో నిండి ఉంటుంది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వెలవెలబోతున్న రైతు వేదికలు

● కర్షకులకు అందని సలహాలు, సూచనలు ● అరకొర సౌకర్యాలతో నానా అవస్థలు ● పట్టించుకోని అధికారులు



మెండోరలోని రైతు వేదిక



మెండోరలో ఫంక్షన్ హాలులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

మెండోర, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు వ్యవసాయశాఖ పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే గతంలో రైతు వేదికలను నిర్మించారు. వీటిలో వ్యవసాయాధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. గత ప్రభుత్వం ఐదువేల ఎకరాలకు ఒక రైతువేదికను నిర్మించి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసింది. అందులో ఏఈవోలు మాత్రం పంటల వివరాల సేకరణకే పరిమితం అవుతున్నారు. దీంతో రైతులకు పంటల సాగులో మెలకువలు అర్థం కాకపోవడంతో తీవ్రంగా నష్టపోతు న్నారు. సంబంధిత అధికారులు రైతువేదికలో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాల్సింది పోయి ఫంక్షన్‌హాల్‌లు, సంఘ భవనాలు, బస్టాండ్ ప్రాంతాల్లో చెట్ల కింద సమావేశాలు ఏర్పాటు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో మూడు రైతు వేదికలు

మెండోర మండలంలో మూడు రైతువేదికలను నిర్మించారు. మెండోరతో పాటు బుస్సాపూర్, వెల్కటూర్ గ్రామాలలో ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో 6628 రైతులకు దాదాపు 12772 ఎకరాల సాగు భూములున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏఈవోల ద్వారా సలహాలు, సూచనలు అందించిన ప్పటికీ ప్రస్తుతం రైతులకు ఎలాంటి సమావేశాలు నిర్వహించడం లేదు.

మద్యం ప్రియులకు అడ్డాగా రైతు వేదికలు

రైతు వేదికలు నేడు మద్యం ప్రియులకు అడ్డాగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు వేదికలకు తలుపులు విరిగిపోవడంతో మద్యం ప్రియులు రాత్రివేళలో మద్యం సేవిస్తున్నారు. అక్కడే మద్యం ప్రియులు నానా హంగామా చేస్తున్నారు. కొన్ని చోట్ల రైతువేదికలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. రైతు వేదికలు నిర్మించి ఏడాదికాకముందే ఎక్కడిక్కడే విరిగిపోయాయి. పైకప్పు రేకులు లేచిపోయాయి. రైతు వేదికలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కనీస సౌకర్యాల కరువు

గత ప్రభుత్వం రైతువేదికను నిర్మిస్తే వాటిలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాగడానికి మంచినీరు లేని పరిస్థితి. రైతువేదికల వద్ద మిషన్ భగీరథ కనెక్షన్ ఇచ్చినప్పటికి నీరు సక్రమంగా రావడం లేదు. రైతు వేదికల్లో స్వీపర్లు లేకపోవడంతో దుమ్ము, ధూళితో దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల ఏఈవోలే సొంత నిధులతో శుభ్రం చేయిస్తున్నారు. అప్పటి ప్రభుత్వం హడావుడిగా నిర్మాణాలు పూర్తి చేసి అరకొర వసతులు కల్పించడంతో నేడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు ప్రతీ రైతు వేదికలో సౌకర్యాల కల్పనకు కృషి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

సలహాలు సూచనలు లేక నష్టపోతున్నాం

● ముస్కు సంతోష్‌రెడ్డి , రైతు వెల్కటూర్



ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా సాగుచేసిన పంటలపై దిగుబడి ప్రభావం పడుతుంది. దీంతో సలహాలు, సూచనలు లేక నష్టపోతున్నాం. అప్పులు తెచ్చి పంటలు సాగుచేస్తే సలహాలు అందడం లేదు. ఏ పంటలు వేస్తే బాగుంటాయే తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతు వేదికలలో రైతులకు సలహాలు సూచనలు అందించాలి.

రైతులకు సలహాలు ఇవ్వడం అధికారులు మరిచారు

● మిట్టపల్లి సాయారెడ్డి, రైతు, మెండోర



రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడం వ్యవసాయాధికారులు మరిచారు. క్షేత్రస్థాయిలో ఉన్న తాధికారుల పర్యావేక్షణ లేకపోవడంతో కేవలం పంట నమోదుకు ఏఈవోలు పరిమితమయ్యారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. గత ప్రభుత్వం రైతులకు సమావేశాలు నిర్వహించి సూచనలు ఇచ్చింది. ప్రస్తుత ప్రభుత్వంలో అది లోపించింది. అధికారులు స్పందించి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలి.

పుట్ట గొడుగుల్లా ఇటుక బట్టీలు

● ఎల్లారెడ్డి మండలంలో యథేచ్ఛగా ఇటుక బట్టీల నిర్వహణ ● నిబంధనలకు తిలోదకాలు ● గ్రామాలకు అతి సమీపంలో రోడ్డు పక్కనే బట్టీలు ● కన్నెత్తి చూడని అధికారులు ● ప్రభుత్వ ఆదాయానికి గండి



ఆంధ్రజ్యోతి పరిశీలన



ఎల్లారెడ్డి - కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఇటుక బట్టీలు



బట్టీల వద్ద వేసిన కలప

ఎల్లారెడ్డి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతులు లేని ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇటుక బట్టీలను, గ్రామాలకు అతి సమీపంలోనే కాకుండా ఎల్లారెడ్డి - కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన నిర్వహించడం గమనార్హం. బట్టీల నిర్వహణతో సమీప గ్రామాలలోని ప్రజలకు రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బంది అధికంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా బట్టీలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. గ్రామాల్లో పలుకుబడి ఉన్న కొంత మందిని మచ్చిక చేసుకోవడం వారి అండదండలతో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్న అటువైపు అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు.

● నిబంధనలకు విరుద్ధంగా..

ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కిన బట్టీల నిర్వాహకులు ఇష్టానుసారంగా గ్రామాల అతి సమీపంలో నిర్వహిస్తున్నారు. అడవుల నుంచి యథేచ్ఛగా కలపని తరలించడం, చెరువుల నుంచి మట్టిని అక్రమంగా తరలించి బట్టీలు నిర్వహిస్తున్నారు. గ్రామాలకు అతి సమీపంలో బట్టీలు కాలుస్తున్న సమయాన వచ్చే పొగతో ప్రజలు నానా రకాల ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బట్టీలను కాల్చడానికి కలపను తరలించడం తో అడవులు అంత రించిపోయే ప్రమాదం ఉంది. దీంతో భవిష్యత్తులో ఈ పర్యావరణానికి అటు ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎల్లారెడ్డి - కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన లక్ష్మాపూర్ గ్రామ సమీ పాన రోడ్డు పక్కనే బట్టిల నిర్వహణ కొనసాగుతోంది. బట్టీల నిర్వాహ కులు నిబంధనలకు విరుద్ధంగా అధికారులకు మామూళ్ళు ఇచ్చి తమ పని కాని చేస్తున్నారని ఆరోపణ వ్యక్తం అవుతున్నాయి.

● పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాలకు అతి సమీపంలోని ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన రహదారి పక్కనే బట్టీలు ఉన్న అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాలుష్యం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్న ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం గ్రామాల్లో నిత్యం సందర్శించే ఆయా గ్రామాల కార్యదర్శులు కూడా రెవెన్యూ అధికారులు సైతం అటు వైపు వెళ్లకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో వారికే తెలియాలి. అధికారుల అలసత్వం బట్టిల నిర్వాహకుల అత్యాశతో పంచాయతీల ఆదాయానికి గండి పడుతుందనేది జగమెరిగిన సత్యం, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ ఇటుక బట్టీలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఇటుక బట్టీలకు నిబంధనలు

ఎక్కడైనా ఇటుక బట్టీలు నిర్వహించాలంటే ముందుగా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శుల నుంచి నిర్వహణకు సంబంధించిన అనుమతి పత్రం తీసుకోవాలి. అది కూడా కార్యదర్శి క్షేత్రస్థాయికి వెళ్లి బట్టి నిర్వహణ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదని ధృవీకరించిన తరువాతనే అనుమతి మంజూరు చేయాలి. అప్పుడు కొన్ని శరతులతో కూడిన అనుమతితో బట్టీలు నిర్వహించుకోవచ్చు. అదేవిధంగా బట్టీలను కాల్చడానికి ఉపయోగించే కల్పకు సంబంధించిన అటవీ శాఖ అధికారులు అనుమతి ఇవ్వాలి. విద్యుత్‌ను వాడుకోవడానికి విద్యుత్ శాఖ అనుమతి, మట్టి తోలు కునేందుకు మైనింగ్ శాఖ నుంచి అనుమతి, భూమి, నాలా కన్వర్షన్ తప్పనిసరిగా ఉండాలి. బట్టీలు కూడా గ్రామానికి దూరంగా జన సంచారం ఎక్కువగా లేని ప్రాంతాలలో పరిమితి దూరంలో నిర్వహించుకోవాలి.


చిన్న గ్రామ పంచాయతీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే!

● చిన్నపల్లెలకు నిధులు కేటాయించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ● గ్రామాల్లో అనేక సమస్యలు ● ఏళ్లు గడుస్తున్నా మెటల్ రోడ్డే దిక్కు

ఆంధ్రజ్యోతి ఫోకస్



గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు ఇదే



జక్కాపూర్ గ్రామ ముఖ చిత్రం



బీటీ రోడ్డు నిర్మాణానికి నోచుకోని జక్కాపూర్ మెటల్ రోడ్డు ఇది

నిజాంసాగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): సరిపడ నిధులు లేక చిన్న గ్రామ పంచాయతీల చింత తీరడం లేదు. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరిపడా నిధులు ఇవ్వడంలో విఫలమయ్యారు. ఎదురులేని చిన్న గ్రామ పంచాయతీకి ఆమడ దూరంలో ఉన్నాయి. 2019లో అప్పటి ప్రభుత్వం చిన్న గ్రామాలను కూడా గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసింది. 1000 జనాభా లేకుండా ఆ గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసింది కానీ ఏళ్ల నుండి మెటల్ రోడ్‌లే ఈ గ్రామానికి దిక్కు. ఈ రహదారిని తార్రోడుగా మార్చేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎలాంటి చొరవ చూపలేకపోతున్నారు. నిజాంసాగర్ మండలం జక్కాపూర్ గ్రామంలో 779 జనాభా కలిగి ఉంది. ఈ గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ గ్రామ పంచాయతీకి ఎన్నికలు నిర్వహించకుండా గ్రామస్థులు ఏకగ్రీవంగా సర్పంచ్ ఎన్నుకున్నారు. గ్రామానికి సరిపడా తాగునీరు దొరకటం లేదు. ఉదయం పూట మిషన్ భగీరథ నీరు వస్తున్నప్పటికీ సాయంత్రం వేళ బల్క్ నీరు సరఫరా చేస్తూ ఉన్నారు. ఈ గ్రామంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న పరిష్కారం చేసే నాథుడే కరువయ్యారు. ఈ గ్రామంలో భూగర్భ జలాలు కరిగిపోవడంతో త్రాగునీటి సమస్య తలెత్తింది. గ్రామంలో ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాల ఉంది. పాఠశాలకు సరిపడా గదులు లేకపోవడంతో అరకొర వసతుల మధ్యన పాఠశాల కొనసాగుతూనే ఉంది. గ్రామానికి 15వ సంఘం ఆర్థిక నిధులు 68 వేల రూపాయలు వస్తున్నప్పటికీ గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్మికులకు జీతాలు కే సరిపడలేదు. గ్రామంలో 201 ఇండ్లు ఉన్నప్పటికీ ప్రతి సంవత్సరం ఇండ్ల టాక్స్ 69 వేల ఐదు వందల రూపాయలు వసూలు చేయడం జరుగుతుంది. ప్రత్యేక నిధులు లేకపోవడంతో అభివృద్ధికి నోచుకోవటం లేదు. గ్రామం నుండి జాతీయ రహదారికి వెళ్లేందుకు మెటల్ రోడ్డు ఉన్నప్పటికీ బీటీ రోడ్ల మార్పులేక పోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్న గ్రామ పంచాయతీలకు గ్రామ పంచాయతీ కార్యాలయం కూడా నిర్మాణం చేపట్టలేకపోయారు. ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం కింద విధులు మంజూరు చేసిన పాలకులు గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని చేపట్టలేకపోయారు. గ్రామ పొలిములలో ఉన్న వన నర్సరీ కూడా నీటి కొరత ఏర్పడడంతో గ్రామ సమీపంలో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న బోర్ బావి నుంచి నీటిని మొక్కలను వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిన్న గ్రామంలో పంచాయతీలకు విధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి ..



గ్రామంలో భూగర్భ జలాలు తరిగి పోయాయి. దీంతో తాగునీటి సమస్య తలెత్తుతుంది. చిన్న గ్రామపంచాయతీకి నిర్వహణకు నిధులు సరి పడలేదు. గ్రామం నుండి నరసింగ రావుపల్లి చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారి బీటీ రోడ్ నిర్మాణం లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తే చిన్న గ్రామ పంచాయతీలు అభి వృద్ధి దిశలో పయనిస్తాయి. **- హరీష్‌గౌడ్, పంచాయితీ సెక్రటరీ**



పల్లె చెరువులో అతిథి పక్షుల సందడి

వేసవి కాలం ముగింపు దశకు చేరుతుండటంతో పల్లెల్లోని వందల కొంగలు ఒకేసారి చెరువులో దిగి చేపల కోసం వేట కొనసాగిస్తుండటంతో చెరువులు సందడిగా మారాయి. ● (ఆంధ్రజ్యోతి, పెద్ద కొడప్‌గల్)

కోర్టులో ఉద్యోగం పేరిట మోసం!

● నకిలీ ఆర్డర్ కాపీతో బురిడీ కొట్టించిన మెసగాడు
● పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ

నిజామాబాద్ అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసి తొమ్మిది లక్షలు వసూలు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా కోర్టులో ఉద్యోగానికి సంబంధించిన ఆర్డర్ కాపీ సైతం బాధితురాలికి అందించి మోసం చేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు సోమవారం పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, సీపీ అందుబాటులో లేకపోవడంతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిజామాబాద్ రూరల్ మండలం లింగీ తండాకు చెందిన తేజవత్ పీరుకు దూరం బంధువు సిరికొండ మండలం, చీమన్‌పల్లి గ్రామానికి చెందిన మాలవత్ మోహన్ తాను గతంలో చాలా మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించానని, వారు ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటున్నారని లేనిపోని మాటలు చెప్పడంతో అతని మాటలు నమ్మి పోస్టాఫీసులో, కోర్టులో ఉద్యోగాలు ఖాళీ ఉన్నవని, ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో తెలిసిన వారని నమ్మి డబ్బులు ఇచ్చామని ఆమె వాపోయారు. పోస్టాఫీసులో ఉద్యోగం కావాలంటే 4లక్షల రూపాయలు ఇవ్వాలని తెలపడంతో, నేను డబ్బులు అప్పు రూపంలో తీసుకొని వచ్చి విడుతల వారీగా 4లక్షల రూపాయలు మోహన్‌కు అతని భార్య, కూతురు, కుమారునికి చెల్లించానని బాధితురాలు చెప్పింది. అతను రేపు, మాపు అంటూ వాయిదాలు పెడుతూ తప్పించుకు తిరుగుతున్నాడని చివరిగా నేను అతని వద్దకు వెళ్లి నాకు ఉద్యోగమైన ఇప్పించు లేదా నేను చెల్లించిన డబ్బులైనా తిరిగి చెల్లించాలని మాలవత్ మోహన్ ను కోరగా అతను నీకు పోస్టాఫీస్‌లో ఉద్యోగం వచ్చిందని ఒక ఫేక్ అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చినాడని అది ఫేక్ ఆర్డర్ అని తేలడంతో నేను అతని వద్దకు వెళ్లి అడిగితే, అతను ఈ విషయం ఎవరికి చెప్పవద్దని, కోర్టులో ఒక పోస్టు ఖాళీగా ఉందని అందులో ఇప్పిస్తానని నమ్మించాడని ఆమె తెలిపారు. కోర్టులో ఉద్యోగం కోసం మరో 5లక్షల రూపాయలు ఇస్తే ఉద్యోగం గ్యారంటీ అని చెప్పినట్లు తెలిపింది. ఇది వాస్తవమని భావించి మళ్లీ అక్కడ ఇక్కడ అప్పు రూపంలో తీసుకొని 5లక్షల రూపాయలు విడతల వారీగా మాలవత్ మోహన్ భార్య, పిల్లలకు చెల్లించమన్నారు. దీంతో నాకు 2025 మార్చిలో కోర్టులో జాబ్ వచ్చిందని చెప్పి అపాయింట్మెంట్ ఆర్డర్ కాపీని అందించినట్లు ఆమె వెల్లడించారు.. కోర్టులో మాలవత్ రాజు అనే వ్యక్తి నన్ను కోర్టు లోపలికి రెండవ ఫ్లోర్ కు తీసుకెళ్లి రిజిస్టార్ తీసుకొని వచ్చి అందులో నా సంతకం తీసుకొని, రేపటి నుండి నీవు కోర్టులో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలి అని చెప్పారని ఇక్కడ ఎవరితో మాట్లాడవద్దు అని చెప్పడంతో అనుమానం వచ్చి ఆ సర్టిఫికేట్ ఇతరులకు చూపించగా, అది ఫేక్ అని తేలడంతో, నన్ను ఎందుకు మోసం చేస్తున్నావు, జాబ్ ఇప్పించకపోతే నేను చెల్లించిన డబ్బులు తిరిగి అప్పించారని కోరడంతో రేపు, మాపు అంటూ వాయిదాలు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆమె అన్నారు. నేను చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వమని కోరితే అతను నన్ను ఒక మహిళనని చూడకుండా బూతు మాటలు తిడుతూన్నాడని ఈ విషయం ఎక్కడ ఫిర్యాదు చేసిన అంతు చూస్తానని బెదిరించినందున మాలవత్ మోహన్, మాలవత్ లవణ్య, మాలవత్ శ్రావణి, మాలవత్ శ్రావణ్ కుమార్, మాలవత్ రాజులపై చట్టరీత్య చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన సుందరయ్య

● సీపీఎం జిల్లా కార్యదర్శి

నిజామాబాద్ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒక్కడైన పుచ్చపల్లి సుందరయ్య అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు అని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన వర్ధంతి సభలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. చిన్నతనంలోనే అంటరానితనం వివక్షత ఇతర రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించారని అన్నారు. చదువును మధ్యలోనే ఆపేసి ఉన్నత భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ భూపోరాటాలను నిర్వహించారని అన్నారు. గాంధీజీ ఇచ్చిన స్వాతంత్ర్య ఉద్యమ పిలుపు మేరకు సుందరయ్య పాల్గొని బ్రిటీష్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొన్నారని అన్నారు. నిజాం నవాబులకు వ్యతిరేకంగా నిర్వహించిన భూపోరాటానికి నాయకత్వం వహించి 10లక్షల ఎకరాల భూములను పేదలకు పంచారని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, సీపీఎం కార్యదర్శి సుజాత, కమిటీ సభ్యులు రాములు, నర్సయ్య, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

నిజామాబాద్ అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ట్రస్మా నిజామాబాద్ శాఖ తరపున సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు ప్రజావాణిలో కలిసి తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ ఫ్రీ రెగ్యులేటర్ కమిటీ సభ్యులు పొందుపరిచిన అంశాల గురించి, వాటిలో ఉన్న ఇబ్బందుల గురించి విన్నవించారు. తెలంగాణ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీల ఫీజుల నియంత్రణ, మానిటరింగ్ కమిషన్ ముసాయిదా చట్టంపై మరియు విద్య హక్కు చట్టం అమలు గురించి అభిప్రాయాలు, అభ్యంతరాలు, సూచనలు కలెక్టర్‌కు వివరించారు. మూడు సంవత్సరాల నుండి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ పాఠశాలలకు రావాల్సిన నిధులు విడుదల చేయకపోవడం వలన పాఠశాలల యాజమాన్యాలు, ఇటు స్కాలర్ షిప్ నిధులు విడుదల కాకపోవడంతో జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, అటు గురుకుల అద్దె భవనాల రెంట్లు(అద్దె) చెల్లించక గురుకుల భవనాల యాజమాన్యాలు ఆందోళనలకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రెజరర్ ఎస్ జయసింహ గౌడ్, జిల్లా అధ్యక్షుడు రాస నిత్యానందం, జిల్లా సెక్రెటరీ గోజూరి అరుణ్, రాష్ట్ర అడ్వైజర్ మామిడాల మోహన్, అర్బన్ ప్రెసిడెంట్ ధర్మరాజు, సెక్రెటరీ పాఠశాల శ్రీనివాస్, నర్సాగౌడ్, పృథ్వీ, మైనారిటీ ప్రెసిడెంట్ ఇక్బాల్‌ఖాన్, మహమ్మద్ కైఫ్, ముజాహిద్ రహమాన్, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆర్‌వో,ఎఫ్ఆర్‌వో పట్టాలు రద్దు!

సిరికొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ పదవిని అడ్డం పెట్టుకుని చేసుకున్న ఆర్‌వో ఎఫ్ఆర్‌వో పట్టాలను కలెక్టర్ రద్దుచేసిన విషయం ఆలస్యంగా తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిరికొండ అటవీ శాఖ రేంజ్ పరిధిలోని పందిమడుగు బీట్‌లోని జనిగ్యాల తండా సమీపాన గల అటవీ భూమిలో సర్వేనెంబర్ 408/3 మాలవత్ రాజేందర్ (మాజీ ఎంపీపీ భర్త)మూడెకరాలు, ఆయన తండ్రి మాలవత్ బీమ్లా సర్వే నెంబర్ 408/4లో మూడెకరాల భూమిని 2023 ఎన్నికలకు ముందు అటవీ శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి తనకు అనుకూలంగా నివేదికను ఆర్డీవో, కలెక్టర్‌కు ఇప్పించుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం శాసన సభ ఎన్నికల ముందు పంపిణీ చేసిన పోడు పట్టాల కార్యక్రమంలో తండ్రి, కొడుకులు ఇద్దరి పేరుతో ఆరెకరాల భూమికి పోడు పట్టాలను అందుకున్నారు. జినిగ్యాల తండా గిరిజనులకు తెలిసిన మరుక్షణమే కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లకు రద్దు చేయాలని ఫిర్యాదు చేశారు. అప్పట్లో సిరికొండ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన కూడా చేశారు. ఎన్నికల్లో అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌కు చెందిన డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి గెలవడంతో జినిగ్యాల తండా వాసులు పట్టాల రద్దు కోసం తీవ్రంగా ప్రయత్నించారు. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించగా సిరికొండ తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, డిప్యూటీ రేంజ్ అధికారి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శి విచారించి తమ నివేదికలను ఆర్డీవో, కలెక్టర్‌లకు సమర్పించారు. ఆర్‌వో ఎఫ్ఆర్‌వో చట్టం 2006లోని సబ్-సెక్షన్ (3),సెక్షన్ (4)లో పేర్కొన్న ప్రకారం 13.12.2005 ప్రకారం మాలవత్ రాజేందర్, మాలవత్ బీమ్ల అటవీ భూమిలో కబ్జాలో లేరని, శాటిలైట్ చిత్రాల స్పష్టం చేస్తున్నట్లు రేంజ్ అధికారి విచారణ నివేదికలో పేర్కొన్నట్లు పట్టాలు రద్దు చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్‌వో ఎఫ్ఆర్‌వో చట్టం 2006 ఉల్లంఘన జరిగిందని విచారణలో స్పష్టంగా పేర్కొన్నారు. పట్టాలను రద్దు చేయకపోతే శాంతి భద్రతల సమస్య తలెత్తవచ్చని భావించిన అధికారులు పట్టాల రద్దుకు ప్రతిపాదించడంతో కలెక్టర్ మాలవత్ రాజేందర్, మాలవత్ బీమ్లా చేయించుకున్న ఆర్‌వో, ఎఫ్ఆర్‌వో పట్టాలను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారని అటవీ శాఖ ఇన్‌చార్జి రేంజ్ అధికారి రవీందర్ ధ్రువీకరించారు.

‘ప్రజావాణి’ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

ప్రజావాణిలో 104 వినతులు స్వీకరించిన అధికారులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 104 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జడ్పీసీఈవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీవో శ్రీనివాస్, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

పూర్తిస్థాయి శానిటరీ ఇన్స్‌పెక్టర్లను నియమించాలి..

నగర పాలక సంస్థలో పూర్తిస్థాయిలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లతో పాటు హెల్త్ అసిస్టెంట్లను తిరిగి నియమించాలని కోరుతూ బీఆర్‌టీయూ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ అండ్ డ్రైవర్స్ జవాన్‌ల యూనియన్ తరపున కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నగర పాలక సంస్థ నిజామాబాద్‌లో పూర్తిస్థాయిలో శానిటరి ఇన్స్‌పెక్టర్లు లేరని, హెల్త్ అసిస్టెంట్లకు డిప్యూటేషన్ ద్వారా ఎస్సైలుగా నియమించారని వారిని తిరిగి హెల్త్ అసిస్టెంట్లుగా నియమించాలన్నారు. జవాన్‌లను పూర్తిస్థాయిలో నియమించి ఔట్‌సోర్సింగ్ జవాన్‌లను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, హన్మాండ్లు, మహేష్, యశ్వంత్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి..

జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజులు, డొనేషన్‌లు వసూలు చేస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్ఎఫ్ కార్యదర్శి యూసుఫ్‌బిన్ అబుద్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నగరంతో పాటు జిల్లాలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారని ప్లేగ్రౌండ్, ఫైర్ సేఫ్టీ, ఇంకా అనేక నిబంధనలు లేకుండానే కొనసాగుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏడో పోలీస్ బెటాలియన్‌ను సందర్శించిన డీఐజీ

డిచ్‌పల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాష్ట్ర తెలంగాణ ఏడో పోలీస్ బెటాలియన్‌ను డీఐజీ సన్నీ సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం బెటాలియన్‌లోని స్టోర్ రూమ్, ఇతర పరిపాలన భవనంలోని గదులను పరిశీలించారు. అనంతరం బెటాలియన్‌లోని రికార్డులను ఆయన పరిశీలించి బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణను, ఇతర అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పట్ల ప్రత్యేక చొరవ చూపాలని అప్రమత్తంతోనే ఏదైనా సాధ్యం అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ డీఐజీకి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ

బడిబాట పోస్టర్ల ఆవిష్కరణ

డిచ్‌పల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి డిచ్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతయ్య ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం బడిబాట పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేసి విద్యార్థుల సంఖ్యను పెంపు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మంచిప్పలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మోపాల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచిప్ప ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. 2008-09 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒక్కచోట చేరి అనుభూతులను గుర్తు చేసుకున్నారు. అప్పుడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా శాలువతో సన్మానించారు. విద్యార్థులు తమ కుటుంబ సమేతంగా ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

ధర్పల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామడుగు సింగిల్ విండో ఆధ్వర్యంలో సోమవారం సబ్సిడీపై విత్తనాలను చైర్మన్ రాజేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగ, జనుము, పచ్చి రొట్టను 50 శాతం సబ్సిడీతో విత్తనాలను విక్రయించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రామడు గుతో పాటు ధర్పల్లి, ఒన్నాజిపేట్ సింగిల్ విండో పరిధిలో సబ్సిడీ విత్తనాలను విక్రయించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో ప్రవీణ్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

సిరికొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇందిర్మ ఇళ్ల నిర్మాణ పథకంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని మాజీ ఎంపీటీసీ సభ్యులు సేంతీయ నౌశిలాల్ లబ్దిదారులను కోరారు. మూషీర్‌గనర్ గ్రామంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి మోహన్ ఇతర స్థానిక అధికారులు ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఖాళీ స్థలాల్లో మార్కింగ్ చేసి ముగ్గులు పోశారు. ఇంటి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ ఎంపీటీసీ సభ్యురాలు లబ్ధిదారులను కోరారు. పనులు బేస్‌మిట్ పనులు త్వరగా పూర్తి చేస్తే ప్రభుత్వం నిధులను వెంటనే విడుదల చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది మూన్‌సింగ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీడీవో అనంత్‌రావు

ఇందల్వాయి, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిరుపేద కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అనంత్‌రావు అన్నారు. మండలంలోని గౌరారంలో 32 మందికి, నల్లవెల్లిలో 24 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు 600 పీట్ల వరకు ఖచ్చితంగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఇంటి నిర్మాణంలో ఖచ్చితంగా హాల్, బెడ్‌రూం, అటాచ్ బాత్‌రూం, కిచెన్ ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఉచిత ఇసుక సరఫరా చేసుకోవచ్చని స్థానిక తహశీల్దార్ అనుమతి తీసుకోవాలన్నారు.

32 మందికి ఆర్థిక సహాయం..



లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

మండలంలోని గౌరారం గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు 32 మందికి మాజీ ఎంపీపీ ఇమ్మడిగోపి ఒక్కొక్కరికి 5వేల చొప్పున లక్షా 60వేల రూపాయలను ఆర్థిక సహాయం సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. ఎవరూ ఆపదలో ఉన్నా తనవంతు సహాయం చేస్తానని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేసిన అనంతరం గృహ ప్రవేశానికి సహాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనంత్‌రావు, ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడిగోపి, హౌజింగ్ ఏఈ అనూష, పంచాయతీ కార్యదర్శి సుశీల, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మూడో రోజు డిగ్రీ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు సోమవారం మూడో రోజు ప్రశాంతంగా జరిగాయని అకాడమిక్ ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో 32 పరీక్ష కేంద్రాల్లో 7680 విద్యార్థులకు గాను 7172 మంది విద్యార్థులు హాజరుకాగా 508 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. ఉదయం జరిగిన 6వ సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలకు 7112 మందికి గాను 6670 మంది హాజరుకాగా 442 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 568 మందికి గాను 502 మంది హాజరుకాగా 66 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు.

ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టుల పూర్వ వైభవానికి చర్యలు!

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాజెక్టులో పూడిక మట్టితో పాటు ఇసుక ఎక్కువగా ఉండడం వల్ల టెండర్లు ఖరా రు చేసి కాంట్రాక్టర్లకు అప్పజెప్పనున్నారు. కాంట్రాక్టర్ల నుంచి మట్టి తరలింపు ద్వారా రూ. 14వేల కోట్లు వసూలు చేసేందుకు సిద్ధమవుతు న్నారు. ఈనెలలో టెండర్లు పిలిచి నెలాఖరు లోపు ఖరారు చేయనున్నారు. జూన్ ఆరంభం నుంచే వర్షాలు పడితే జూన్ చివరి వారం నుంచి ప్రాజెక్టులోకి వరద వచ్చే అవకాశం ఉండడంతో.. ముందస్తుగా టెండర్లు పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు కట్టబెట్టి నిర్ణీత సమయంలో మట్టిని తొలగించే విధంగా వారికి కొన్ని సంవత్సరాల పాటు గడువు ఇవ్వనున్నారు. మట్టి, ఇసుక తవ్వకాల ద్వారా ఆదాయాన్ని సాగునీటి శాఖకు సమకూర్చుకుంటూనే పూర్తి కెపాసిటీని తీసుకొచ్చే విధంగా ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు నివేదికను తయారు చేశారు. నిర్ణీత సమయంలో పూడిక తీస్తే ప్రాజెక్టుకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చి.. అదనపు ఆయకట్టుకు సాగునీటిని అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వలు భారీగా తగ్గిపోయాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి కెపాసిటీ 1091అడుగులకు గాను 1060.70అడుగుల మేర నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టులో మొత్తం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 11.23 టీఎంసీల మేర నీళ్లు ఉన్నాయి.

నిజాంసాగర్ ప్రాజెక్టులోనూ..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు తరహాలోనే నిజాంసాగర్ ప్రాజెక్టులో కూడా పూడిక తీసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిజాం హయాంలో నిజాంసాగర్ ప్రాజెక్టును నిర్మించారు. 30టీఎంసీల కెపాసిటీతో దీన్ని నిర్మించారు. ప్రస్తుతం దీని కెపాసిటీ 17.802 టీఎంసీలుగా ఉంది. అయితే పూడిక విపరీతంగా పేరుకు పోవడంతో.. ఈ ప్రాజెక్టులో పూడిక తీసేందుకు అధికారులు రూ. 7500కోట్ల ఆదాయ రాబడికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌కు పంపించారు. ఈ విషయాన్ని సాగునీటి శాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లారు. దీంతో త్వరలోనే నిజాంసాగర్‌తో పాటు ఎస్సారెస్పీకి టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మంజీరా నదిపై నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు గత 80ఏళ్లుగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతులకు సాగునీటిని అందిస్తోంది. ఓ వైపు ఎస్సారెస్పీ.. మరోవైపు నిజాంసాగర్.. ఈ రెండు ప్రాజెక్టుల కెపాసిటీ పెరిగితే ఉమ్మడి జిల్లా పరిధిలోని చివరి ఆయకట్టు వరకూ సాగు నీరు అందనుంది. పూడిక తీయడం వల్ల కెపాసిటీ పెరగడంతో పాటు ఉమ్మడి జిల్లాలో చేపట్టిన ప్రాణహిత, చేవెళ్ల ప్యాకేజీల ద్వారా అదనంగా 4లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405అడుగులకు గాను ప్రస్తుతం 1393.14 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టులో 17.802టీఎంసీలకు గాను ప్రస్తుతం 5.630టీఎంసీల మేర నీళ్లు ఉన్నాయి.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఫీజులు పెంచడాన్ని ఖండిస్తూ వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అలాగే స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ సోమవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూరు విభాగ కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను పలుమార్లు మోసం చేస్తూ వస్తుంది ఇప్పటికే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రాక ఎందరో మన విద్యార్థులు చదువుకు దూరమైనటువంటి పరిస్థితి ఈ తెలంగాణ రాష్ట్రంలో కనబడుతుందన్నారు. ఇంకా ఫీజులను పెంచుతూ పేద విద్యార్థులను చదువకోకుండా చేస్తున్నటువంటి వైఖరిని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. టీఏఎఫ్ఆర్సీకి తప్పుడు ఆడిట్ లెక్కలు సమర్పిస్తూ పేద విద్యార్థులను దోచుకుంటున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, కళాశాలల కేటగిరి సీట్లను ప్రభుత్వమే ఆన్లైన్ ద్వారా భర్తీ చేయాలని, డొనేషన్లు వసూలు చేస్తున్న కళాశాలలను బ్లాక్ లిస్టులో పెట్టాలని, ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల వెంటనే చేయాలని, పేద విద్యార్థులు చదువుకునే విధంగా ప్రభుత్వం యొక్క నిర్ణయాలు ఉండాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అలాగే రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సోషల్ మీడియా కన్వీనర్ సునీల్, నగర కార్యదర్శి బాలకృష్ణ, యోగేష్, సిద్దు, హేమంత్, రంజిత్, దుర్గాదాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాట్లాడే బొమ్మ ప్రదర్శన



నిజామాబాద్ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కేరింతలు, చప్పట్ల మధ్య కళాకారుడు జాదూ రంగనాథ్ మాట్లాడే బొమ్మ ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా కేంద్రంలోని బాల్‌భవన్‌లో విద్యార్థులకు వేసవి శిక్షణలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన మాట్లాడే బొమ్మ ఆద్యాంతం విద్యార్థులను అలరించింది. మాట్లాడే బొమ్మ విద్యార్థులను ఉత్సాహపరుస్తూ ప్రదర్శన సాగింది. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సూపరింటెండెంట్ ఉమాబాల, వెంకటలక్ష్మి, లలిత, విశ్రాంత సూపరింటెండెంట్ విఠల్ ప్రభాకర్, లక్ష్మణ్, సోని, శ్రీలత పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

● సీఎస్‌డీవోల సమావేశంలో ఇంటర్ విద్య అధికారి రవికుమార్

నిజామాబాద్ అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా పనిచేయాలని డీఐఈవో రవికుమార్ కోరారు. సోమవారం నిజామాబాద్ ప్రభుత్వ బాలుర (ఖిల్లా) జూనియర్ కళాశాలలో నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్ లు, డిపార్ట్మెంటల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఇదివరకే అన్ని విభాగాల అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలోనే పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని అన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంటల్ అధికారులు ఖచ్చితంగా నిబంధనలను పాటిస్తూ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం రెండవ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని అన్నారు. జిల్లాలో 36 సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా మంచినీటి వసతి, మరుగుదొడ్లు, వైద్య సేవల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య సేవలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ లు, డిపార్ట్మెంటల్ అధికారులు సమన్వయంతో పని చేసి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తమ అధీనంలోకి తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాల బండిల్లను పోలీసు బందోబస్తు తో తీసుకువెళ్లిన తర్వాత పరీక్షా కేంద్రంలో ఖచ్చితంగా సీసీ కెమెరాల ముందు మాత్రమే తెరవాల్సి ఉంటుందని అన్నారు. మధ్యాహ్నం నిర్వహించే రెండవ సంవత్సరం పరీక్షల జవాబు పత్రాల బండిల్లను సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో నిక్షిప్తం చేసి మరునటి రోజు ఉదయం తీసుకోవాలని అన్నారు. పరీక్ష కేంద్రాల్లో సెల్ ఫోన్ గాని ఇతర సాంకేతిక గాడ్జెట్ లను ఎవరు తీసుకురాకుండా చూసే బాధ్యత సీఎస్, డీవోలదే బాధ్యతని అన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన సిబ్బంది, ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఇంటర్నెట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతో పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని ప్రైవేటు కళాశాలలు సైతం విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వాలని ఇబ్బంది పెట్టవద్దన్నారు. సమావేశంలో 36 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపర్డెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, అసిస్టెంట్ చీఫ్ సూపర్డెంట్లు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.130	రూ.240	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	: రూ.140	రూ.250	రూ. 270



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.95,800	రూ.88,400	రూ.1010

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) (10.10)
సింగిల్ (1.40, 7.55)
మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్) (4.25, 10.40)
స్క్రీన్-2 : శుభం (11.25)
: లవ్‌లీ (2.05)
: సింగిల్ (4.35, 10.50)
: మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) (7.20)
స్క్రీన్-3 : లెవన్ (10.40)
: యమదొంగ (1.35) : 23 (5.15) : శుభం (8.05)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (ఇంగ్లీష్) (10.45)
స్క్రీన్-4 : ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (11.20, 1.50) : హిట్-3 (4.20, 10.05)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (ఇంగ్లీష్) (7.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సింగిల్ (1.30, 7.30)
: యమదొంగ (4.10, 10.30)
స్క్రీన్-2 : సింగిల్ (11.00 4.30, 10.30)
: హిట్-3 (1.30, 7.20)
స్క్రీన్-3 : మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) (10.20, 4.20, 7.20, 10.20)
: మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్) (1.20)

లలితామహల్ : యమదొంగ (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : సింగిల్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : హిట్-3 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్